స్వల్పంగా కుంగిన పిల్లర్!

మొదటిపేజీ తరువాయి...

నిర్మాణాల్లో పేరెన్నికగన్న ఎల్‌అండ్‌టీ సంస్థ ఈ బరాజ్‌ను నిర్మించింది. 16.17 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో 85 గేట్లు, 87 పిల్లర్లు ఉన్న ఈ బరాజ్ 2019లో అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి గత ఐదు సీజన్ల (వానకాలపు వరదలు)లోనూ గోదావరిలో వచ్చిన భారీ వరదలను ఈ బరాజ్ తట్టుకుని నిలబడింది. ముఖ్యంగా గత ఏడాది (2022) వానాకాలంలో గోదావరి చరిత్రలోనే అతి ఎక్కువగా, 28 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పటికీ లక్ష్మీ బరాజ్ తట్టుకొని నిలబడింది. ప్రస్తుతం గోదావరిలో భారీ వరద కూడా లేదు. కేవలం 14,930 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదవుతున్నది. ఇలాంటప్పుడు మామూలుగా పిల్లర్ కుంగిపోవడానికి ఆస్కారమే లేదని సాగునీటి రంగ నిపుణులు అంటున్నారు.

ప్రభుత్వంపై పైసా భారం పడదు: ఈఎన్‌సీ

లక్ష్మీబరాజ్ ఘటనపై ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లు స్పందించారు. పెద్ద చప్పుడు వచ్చిన తర్వాత పిల్లర్ కొంత కుంగినట్టు కనిపించిందని ఆయన చెప్పారు. అయితే ఇందుకు అసలు కారణం ఏమిటనేది మాత్రం ఇప్పుడే చెప్పలేమన్నారు. తెల్లారిన తర్వాత సమగ్రంగా పరిశీలిస్తేగానీ అసలు ఏం జరిగిందనే దానిపై కచ్చితమైన నిర్ణయానికి రాలేమని వివరించారు. సమస్య పిల్లర్లకు సంబంధించినదా? లేక బేరింగులకు సంబంధించినదా? లేక కుట్రకోణం ఏమైనా ఉన్నదా? విద్రోహ చర్య ఏమైనా జరిగిందా? అన్నది కూడా ఇప్పుడే చెప్పలేమని ఆయన అన్నారు. ఇది అంతర్రాష్ట్ర బరాజ్ అయినందున జరిగిన సంఘటనపై ఇటు తెలంగాణలోని మహదేవపూర్, అటు మహారాష్ట్రలోని సిరొంచ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. బరాజ్‌ను ప్రతిష్ఠాత్మక ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించిందని, అయిదేండ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా ఆ ఏజెన్సీదేనని వివరించారు. అందువల్ల బరాజ్‌లో ఎలాంటి సమస్య తలెత్తినా దాన్ని సరిచేయాల్సిన బాధ్యత కంపెనీపైనే ఉంటుందని స్పష్టంచేశారు. దీని వల్ల ప్రభుత్వంపై నయాపైసా కూడా అదనపు భారం పడబోదని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని ఎల్‌అండ్‌టీ ఏజెన్సీకి తెలియజేశామని, వాళ్ల సీనియర్ సీజీఎం సైట్‌కు వస్తున్నారని చెప్పారు. ఆదివారం ఉదయం వరకు ఎల్‌అండ్‌టీ హయ్యర్ ఆఫీసర్ వచ్చి పరిశీలిస్తారని తెలిపారు. ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని ఏజెన్సీవారు చెప్పారని అన్నారు. దీనికి వారంటీ పీరియడ్ ఉందని, గోదావరి నదిపై కట్టే బరాజ్ కాబట్టి అగ్రిమెంట్ చేసేటప్పుడే అన్ని సేఫ్టీలతోపాటు వారంటీ పీరియడ్ ఉండేట్టు చూసుకున్నామని చెప్పారు. జరిగిన డ్యామేజీ కూడా అతిచిన్నదే అని అనుకొంటున్నట్టు తెలిపారు. ఈఈని అక్కడే ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించామని, టెక్నికల్ సిబ్బందికి తగిన సూచనలు జారీచేసినట్టు చెప్పారు. ఇందులో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బరాజ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని అన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ఎల్‌అండ్‌టీ కంపెనీ వారు సిద్ధంగా ఉన్నారని, అది చాలా పెద్ద కంపెనీ అని తెలిపారు. ఇలాంటివాటిలో వారికి చాలా అనుభవం ఉన్నదని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే ఏజెన్సీతో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని, బరాజ్‌ను నీటి నిల్వకు సిద్ధంగా చేసి రాకపోకల్ని పునరుద్ధరిస్తామని వెంకటేశ్వర్లు వివరించారు.

రూ.400కే సిలిండర్

- మ్యానిఫెస్టోలో బీఆర్ఎస్ హామీ
- మోదీ వచ్చినపుడు ధర రూ.414
- 2 నెలల కిందటిదాకా రూ.1,155
- ఒక్కో సిలిండర్‌పై రూ.714 పెంపు
- కేసీఆర్ హామీతో తేరుకున్న ప్రజలు
- బండ భారం తగ్గుతుందని సంతోషం
- కుటుంబానికి ఏటా 4 వేలు ఆదా

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): పేదలపై మోదీ సర్కారు మోపిన బండ భారాన్ని తగ్గించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కంకణం కట్టుకున్నారు. ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టాక రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన హామీని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. కేసీఆర్ నిర్ణయంతో ఒక్కో కుటుంబంపై ఏటా సుమారు రూ.4 వేలు ఆదా కానున్నాయి. మళ్లీ సంతోషంగా సిలిండర్‌పై ధైర్యంగా వంట చేసుకునే పరిస్థితి రానున్నది.

రూ.741 పెంచిన కేంద్రం

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిరాగానే ప్రధాని మోదీ పేదలపై కక్షగట్టారు. ఇందులో భాగంగానే పేదలపై బండ భారాన్ని మోపారు. అడ్డూఅదుపు లేకుండా ఎడాపెడా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచేశారు. ప్రధాని మోదీ అధికారంలో వచ్చిన 2014లో గ్యాస్ సిలిండర్ ధర రూ.414 మాత్రమే. అది 2023లో రూ.1,155 కి చేరింది. రెండు నెలల క్రితం వరకు ఇదే ధర కొనసాగింది. అంటే మోదీ వచ్చిన ఏకంగా రూ.741 ధర పెంచటం గమనార్హం. దీంతో కుటుంబాలపై ఆర్థిక భారం పడింది. ఒక్కో కుటుంబంపై ఏటా సగటున రూ.5 వేల వరకు భారం పడింది. దీంతో గ్యాస్ బుక్ చేయాలంటేనే పేదలు వణికిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్యాస్ సిలిండర్‌ను మూలన పెట్టేసి, మళ్లీ కట్టెల పొయ్యి వైపు మళ్లారు. కట్టెల పొగ, ఇతర సమస్యలతో అనారోగ్యం బారిన పడుతున్నారు.

ఒక్కో కుటుంబానికి ఏటా రూ.4 వేలు ఆదా

సీఎం కేసీఆర్ ప్రకటించిన హామీ పేదలకు వరంగా మారనున్నది. ఈ హామీపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతున్నది. బండ భారం తగ్గుతుండటంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌ను రూ.955కు విక్రయిస్తున్నది. అయితే సీఎం కేసీఆర్ దీన్ని రూ.400కే ఇవ్వనున్నారు. అంటే ఒక్కో సిలిండర్‌పై రూ.555 ఆదా కానున్నది. ఒక కుటుంబం సగటున ఏటా 7-8 సిలిండర్లను వినియోగిస్తుందని అంచనా వేసుకున్నా, ఏటా రూ.4వేల వరకు మిగలనున్నది.

> **కేసీఆర్ మాటిస్తే చేసి తీరుతడు**
>
> కట్టెల పొయ్యితో ఇబ్బందైతందని గ్యాస్ కనెక్షన్ తీసుకున్నం. అప్పుడు రూ.400కే గ్యాస్ మొద్దు ఇచ్చేటోళ్లు. మోదీ సర్కారు వచ్చినప్పటి నుంచి గ్యాస్ ధరలు పెంచుకుంట పోయిన్రు. రూ.1,200 చేసిన్రు. అసలే కూలీ పనులు చేసుకునేటోళ్లం. గన్ని డబ్బులు పెట్టి ఎట్లా కొనుక్కుంటం. గందుకే మళ్లా కట్టెల పొయ్యి మీదనే వంట చేసుకుంటున్నం. మన ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లా గెలిస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తనని చెప్పిండు. ఆయన మాటిస్తే కచ్చితంగా చేసి తీరుతడు. మళ్లా బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.
>
> - దుర్గం పుష్పలత, కుకుడ, బెజ్జూర్ మండలం, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా

> **పేదలపై ఆర్థిక భారం తగ్గుతుంది**
>
>
>
> రూ.400కే సిలిండర్ ఇస్తామంటూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఎంతో గొప్పది. ఇది పేద వినియోగదారులకు గొప్ప వరం. ఇటీవల గ్యాస్ ధరలు పెరగటంతో పేదలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంత మంది నెలల పాటు గ్యాస్‌బుక్ చేసుకోలేదు. ఇప్పుడు గ్యాస్ ధర అందుబాటులోకి వస్తే వాళ్లంతా మళ్లీ గ్యాస్ వినియోగిస్తారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది.
>
> - జగన్మోహన్‌రెడ్డి, గ్యాస్ డీలర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

> **పేదోళ్లకు మంచి చేస్తుండు**
>
>
>
> గ్యాస్ ధర తగ్గిస్తమని హామీ ఇచ్చి కేసీఆర్ సారు మాలాంటి పేదోళ్లకు మంచిజేస్తుండు. రూ.400కే సబ్సిడీ సిలిండర్‌ను నిరుపేద మహిళలకు ఎంతో మేలుజేసే పథకం. కుటుంబానికి పెద్ద భారం తీరుతుంది. కేసీఆర్ చెప్పినట్టే చేస్తడు. ఆయన మీద నమ్మకం ఉన్నది. ఆయన నూరేండ్లు సల్లగ బతకాలని దేవున్ని మొక్కుతం. ఆయన మంచిగుంటే మాలాంటి పేదోళ్లు సంతోషంగా బతుకుతరు.
>
> -రజిత, అల్వాల్

> **పేదల గోస తీరుతుంది**
>
>
>
> మాది మధ్య తరగతి కుటుంబం. నా భర్త కూలీ పనికి వెళ్తేనే ఇల్లు గడిచేది. రోజువారి కూలీ చేసిన డబ్బులతోనే కుటుంబాన్ని నడుపుతున్నం. పెరిగిన ధరలతో గ్యాస్ సిలిండర్ కొనలేకపోతున్నం. కట్టెల పొయ్యి మీద వంట చేద్దామంటే ఫారెస్ట్ వాళ్లు అడవిలోకి రానివ్వటం లేదు. కిరోసిన్ దొరకటం లేదు. సిలిండర్ కొందామంటే ఎక్కడలేని బాధనిపిస్తున్నది. ఈ సమయంలో కేసీఆర్ సార్ దేవుడిలా వంట గ్యాస్‌ను రూ.400కే ఇస్తమని అంటుండు. నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాల బాధలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి మళ్లీ రావాలి. గెలిస్తే మా ఇబ్బందులను తీరుస్తడు.
>
> - ఎస్కే యాసిన్, నిర్వాసిత కాలనీ, ఇల్లందు టౌన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

> **మాలాంటి పేదలకు మేలు**
>
>
>
> మేము కూలి చేసుకుంటేనే బతుకుదెరువు. కుటుంబ పోషణ కోసం మా ఆయన దుబాయ్ వెళ్లిండు. బీడీలు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నా. ఒక సిలిండర్ కొనడానికి 1,200 అవుతుంది. గ్యాస్ సిలిండర్ కొనలేని పరిస్థితి నాది. నేను బీడీలు చేస్తే వచ్చేది రూ.2,000. అందులో సిలిండర్‌కే 1,200 పోతే బతుకుడు ఎట్ల. ఇప్పుడు కేసీఆర్ సాబ్ రూ.400కే సిలిండర్ ఇస్తామని చెప్పడం ఖుషీ అన్పిస్తుంది.
>
> -కరీమున్నిసా, సిద్దిపేట

బరాజ్‌పై పేలుడు వంటి శబ్దం

- నిత్యం బరాజ్‌పై జరుగుతున్న పనులు
- 20వ నెంబర్ పిల్లర్‌పై తేడా కనిపిస్తుంది
- అధిక వరదల్లోనూ నష్టం జరగలేదు
- మహారాష్ట్ర వైపునుంచి 300 మీటర్లలోనే ఘటన
- అక్కడ పోలీసు క్యాంపు కూడా ఉంది
- ఘటనపై విచారణకు ఆదేశిస్తాం
- ఇది చాలా చిన్న డ్యామేజ్
- భయాందోళన అవసరం లేదు
- మేడిగడ్డ ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): లక్ష్మీ బరాజ్ వద్ద జరిగిన సంఘటనపై మేడిగడ్డ ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు శనివారం రాత్రి వివరణ ఇచ్చారు. 'జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌పై శనివారం సాయంత్రం సమయంలో పేలుడు వంటి శబ్దం వచ్చింది. అక్కడే ఉన్న మా కంట్రోల్‌రూం సిబ్బంది అప్రమత్తమయ్యారు. అసలు ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని ఆయన తెలిపారు. శబ్దం వచ్చిన అనంతరం తమ సిబ్బంది అప్రమత్తమై ఏం జరిగిందో తెలుసుకుంటున్నారని చెప్పారు. బ్రిడ్జిపై నిత్యం పనులు జరుగుతున్నాయని, రాత్రి కాగానే ఎల్ అండ్ టీ, ఇరిగేషన్ వారు పనులు ముగించుకొని వెళ్లిపోయారని, బ్రిడ్జిపై రాకపోకలు సైతం తగ్గిపోయాయని తెలిపారు. అదే సమయంలో బరాజ్‌పై పెద్ద శబ్దం వచ్చినట్టు తెలిపారు. మహారాష్ట్ర వైపు నుంచి 300 మీటర్ల దూరంలో 20వ పిల్లర్ వద్ద ఈ శబ్దం వచ్చినట్టు తెలుస్తున్నదని, దూరంగా వెళ్లి పరిశీలిస్తే 20వ పిల్లర్ వద్ద బ్రిడ్జి కొంత సింక్ అయి కనిపిస్తున్నదని చెప్పారు. బరాజ్‌పై నుంచి ఎక్కువగా మహారాష్ట్ర, తెలంగాణ కూలీలే అధికంగా వెళ్తూ ఉంటారని తెలిపారు. 20వ పిల్లర్ వద్ద దూరంగా పరిశీలిస్తే పెద్దగా డ్యామేజీ కాలేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అక్కడే పోలీసు క్యాంపు కూడా ఉన్నదని, పోలీసు విచారణకు ఆదేశిస్తున్నామని చెప్పారు. నిరుడు రికార్డుస్థాయిలో వరదలు వచ్చాయని, బరాజ్ డిజైన్ చేసినదానికంటే ఎక్కువ వరదలు వచ్చినప్పటికీ బరాజ్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. వందేండ్ల డాటా తీసుకొని బరాజ్‌కు డిజైన్ చేసినట్టు వివరించారు. కాళేశ్వరంలో 1986 ఆగస్టు 15న అత్యధికంగా వరదలు వచ్చాయని, నిరుడు ఆ వరదలను దాటి 1.02 మీటర్ల వరద నీరు పైకి వచ్చిందని చెప్పారు. అయినా నీరు సేఫ్‌గా వెళ్లిపోయిందని వెల్లడించారు. ఇప్పటికీ బ్రిడ్జి పనులు ఎల్‌అండ్‌టీ ఆధీనంలోనే ఉన్నాయని, ఐదేండ్లు మెయింటెనెన్స్ వారి బాధ్యత అని, ఇంకా డెవలప్‌మెంట్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పోలీసు విచారణలో పూర్తిస్థాయి వివరాలు తెలుస్తాయని స్పష్టం చేశారు.

కార్మికుల ఖాతాల్లో 711 కోట్లు జమ

సీఎండీ శ్రీధర్‌కు సింగరేణి కుటుంబాల కృతజ్ఞతలు

గోదావరిఖని, అక్టోబర్ 21: సింగరేణి 2022-23లో సాధించిన లాభాల నుంచి 32 శాతం వాటా రూ.711 కోట్లను యాజమాన్యం కార్మికుల ఖాతాల్లో శుక్రవారం జమ చేసింది. మొదట ఈ నెల 16న చెల్లించాలని నిర్ణయించిన యాజమాన్యం.. ఎలక్షన్ కోడ్ రావడంతో సందిగ్ధంలో పడ్డది. సింగరేణి అధికారుల కమిటీ వివరణ విన్న ఎన్నికల అధికారులు సింగరేణి లాభాల వాటా విడుదలకు అనుమతించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం.. లాభాల వాటాను, దసరా అడ్వాన్స్ రూ.25 వేలను కార్మికుల అకౌంట్లలో జమచేసింది. దీంతో కార్మికుల కుటుంబాలు సంతోషంలో మునిగిపోయాయని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. సీఎండీ శ్రీధర్‌కు ఓసీపీ-3, ఆర్జీ-2 ఈపీ ఫిట్టర్ కనకం రమణయ్య కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల కేసులు సత్వరమే పరిష్కరించండి

- జిల్లాల గ్రీవెన్స్ కమిటీలను సమావేశపర్చండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 21 (నమస్తే తెలంగాణ): జిల్లాల గ్రీవెన్స్ కమిటీలను సమావేశపరిచి నిబంధనల మేరకు హేతుబద్ధమైన ఎన్నికల కేసులను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. జిల్లాల్లో ఎన్నికల విధుల్లో ఉన్న ఈఆర్వోలు, ఆర్వోలతో శనివారం ఆయన రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ప్రజల నుంచి, రాజకీయ పార్టీల నుంచి తరచూ వస్తున్న ఫిర్యాదులను వారి దృష్టికి తెచ్చారు. ఓటర్లలో విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాలని డీజీపీ అంజనీకుమార్ నొక్కి చెప్పారు. పోలీసు నిఘా, పనితీరు ప్రజల దృష్టిని ఆకర్షించేలా ఫ్లాగ్ మార్చ్, డ్రోన్లతో చిత్రీకరిస్తూ ఉండాలని రాష్ట్ర వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి మహేశ్ భాగవత్ సూచించారు. నగదు, మద్యం, బంగారం వంటివి పట్టుబడ్డప్పుడు తప్పకుండా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల అధికారులు స్పష్టమైన తీర్మానాలతో నివేదికలు పంపాలని అదనపు సీఈవో లోకేశ్‌కుమార్ సూచించారు. వివిధ ఫారాల వినియోగాన్ని జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ వివరించారు. పోస్టల్ బ్యాలెట్ అవసరమైన వారికోసం 12 డీ ఫారాన్ని వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలని డిప్యూటీ సీఈవో సత్యవాణి సూచించారు. ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల ఈఆర్వోలు, ఆర్వోలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గురుకుల పోస్టుల భర్తీకి అనుమతివ్వండి

- ఎన్నికల కమిషన్‌కు గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు విజ్ఞప్తి
- ఇప్పటికే క్యాటగిరీ వారీగా మెరిట్ జాబితాలు సిద్ధం

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి నియామక ప్రక్రియను కొనసాగించేందుకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ముమ్మర కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే పోస్టుల వారీగా, అభ్యర్థుల అష్టన్ల వారీగా మెరిట్ జాబితాలను కూడా సిద్ధం చేసింది. అయితే, తదుపరి నియామక ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతివ్వాలని కోరుతూ ఎలక్షన్ కమిషన్‌కు లేఖ చేసింది. ఈసీ అనుమతులను మంజూరు చేస్తే వెంటనే మెరిట్ జాబితాలను విడుదల చేసి సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌ను చేపట్టేందుకు సన్నద్ధం అవుతున్నది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో కలిపి మొత్తంగా పీజీటీ, టీజీటీ, డీఎల్, జేఎల్, పీడీ, లైబ్రేరియన్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ మొత్తంగా 9 విభాగాల్లో 9,210 పోస్టులను భర్తీ ప్రక్రియను ట్రిబ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆగస్టు 1 నుంచి 23 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)ను సైతం నిర్వహించింది. మొత్తం 6,52,413 మంది దరఖాస్తు చేసుకోగా 4,93,727 మంది పరీక్షలను రాశారు. అభ్యర్థుల నుంచి పోస్టుల వారీగా ఈ నెల 16 వరకు అష్టన్లను సైతం స్వీకరించింది. ప్రస్తుతం పోస్టులవారీగా 1 : 2 నిష్పత్తిలో మెరిట్ జాబితాలను సిద్ధం చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో భర్తీ ప్రక్రియకు అనుమతులు మంజూరు ఎన్నికల కమిషన్‌ను తాజాగా ట్రిబ్ విజ్ఞప్తి చేసింది. ఈసీ అనుమతులు మంజూరు చేస్తే వెంటనే పైస్థాయి నుంచి దిగువస్థాయి పోస్టుల భర్తీని చేపట్టాలని ట్రిబ్ నిర్ణయించింది. అందులో భాగంగా తొలుత డీఎల్, అటు తరువాత జేఎల్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది.

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
ప్రొఫెసర్ జి. రామ్‌రెడ్డి మార్గ్, రోడ్ నం. 46, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033

ఇరవై ఐదవ స్నాతకోత్సవ ప్రకటన

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్ యొక్క ఇరవై ఐదవ స్నాతకోత్సవం ఉత్తీర్ణులైన అభ్యర్థులకు డిగ్రీలు/డిప్లొమాలు/సర్టిఫికెట్లు అందజేయుటకు 2వ వారం డిసెంబర్, 2023లో నిర్వహించబడుతుంది. M.Phil & Ph.D ప్రోగ్రామ్‌లతోసహా UG కోర్సులు, PG/డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సుల కొరకు సెప్టెంబర్ 2021 నుండి ఫిబ్రవరి 2023 వరకు డిగ్రీల అవార్డు కొరకు అర్హత కలిగినట్లుగా ప్రకటించబడిన అభ్యర్థులు అందరూ ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం ద్వారా దరఖాస్తు చేయవలెను.
స్నాతకోత్సవానికి స్వయంగా హాజరుకాగోరే అభ్యర్థులు 30 నవంబర్, 2023న లేదా ఆలోగా వెబ్‌సైట్లు www.braou.ac.in లేదా www.braouonline.in నుండి ఫీజు కొరకు రూ. 500/- చెల్లించుటతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయవలెను.
స్నాతకోత్సవానికి స్వయంగా హాజరుకాలేని అభ్యర్థులు అవసరమైన ఫీజు రూ. 600/- చెల్లించి ఆన్‌లైన్ ద్వారా తమ డిగ్రీ ఇన్ అబ్సెన్షియా కొరకు దరఖాస్తు కూడా చేయవచ్చు. ఈ విద్యార్థుల సర్టిఫికెట్లు స్నాతకోత్సవం తరువాత స్పీడ్ పోస్ట్ ద్వారా వారి సంబంధిత చిరునామాలకు పంపబడతాయి.
ఆఖరి తేది తరువాత అందిన దరఖాస్తులు మరియు అసంపూర్తి దరఖాస్తులు తిరస్కరించబడతాయి.

DIPR RO.No. 8160-PP/CL/ADVT/1/2023-24, Dt: 20-10-2023 సం/- రిజిస్ట్రార్